క్లుప్తంగా

అతివలే అత్యధికం



ఓటు వేసేందుకు క్యూలో నిలుచున్న మహిళా ఓటర్లు

దొర్నిపాడు: సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా సోమవారం జరిగిన పోలింగ్‌లో పురుషుల కంటే మహిళా ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. మండలంలో 26 పోలింగ్ స్టేషన్లలో పురుషులు 10,084, మహిళలు 10,202, థర్డ్ జెండర్ 1 మొత్తం 20,287 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో పురుషులు 8,570, మహిళలు 8,641 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. అంటే 20,287 మంది ఓటర్లకు గాను 17,211 మంది ఓటు వేశారు. మండలంలో మొత్తం 84.84 శాతం పోలింగ్ నమోదైనట్లు అధికారులు తెలిపారు.

24 నుంచి పది సప్లిమెంటరీ పరీక్షలు

నంద్యాల(న్యూటౌన్): పదో తరగతి పరీక్షల్లో ఫెయిల్ అయిన విద్యార్థులు విద్యాసంవత్సరం నష్టపోకుండా మే 24 నుంచి జూన్ 3వ తేదీ వరకు సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు డీఈఓ సుధాకర్‌రెడ్డి మంగళవారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ రీ వెరిఫికేషన్, తప్పిపోయిన సబ్జెక్టులకు ఫీజు చెల్లింపు తేదీల గడువు ముగిసిందన్నారు. సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించేందుకు పరీక్ష కేంద్రాలను త్వరలోనే ప్రకటిస్తామన్నారు. పరీక్షలు పకడ్బందీగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు డీఈఓ తెలిపారు.

ఘనంగా భగీరథ జయంతి



భగీరథుని చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

నంద్యాలటౌన్: నంద్యాల అసెంబ్లీ సగర సంఘం, యువజన సంఘాల ఆధ్వర్యంలో భగీరథ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. మంగళవారం పట్టణంలోని ఎస్‌బీఐ కాలనీ సెంటర్‌లో ఏర్పాటు చేసిన భగీరథ చక్రవర్తి జయంతి వేడుకల్లో పాల్గొన్న సగర సంఘం అధ్యక్షుడు బోయిని బాలాజీ, గౌరవాధ్యక్షులు టివై శివయ్య మాట్లాడుతూ.. తన పితృదేవతలకు సద్గతులు కల్పించేందుకు సనాతన ధర్మంలో ఎంతో పవిత్రంగా భావించే ఆకాశ గంగను మానవ సంకల్పంతో తపస్సు చేసి భూమి పైకి తీసుకొచ్చిన భగీరథ చక్రవర్తి జీవితం ప్రతి ఒక్కరికీ ఆదర్శప్రాయమన్నారు. ఆయన తరువాతి సంతతి వారసులుగా నేటికీ సగరులు ఆయన కీర్తి ప్రతిష్టలను విస్తరిస్తున్నారన్నారు. అనంతరం భగీరథుని చిత్ర పటానికి పూల మాలలు వేసి పూజలు చేశారు. సంఘం ప్రధాన కార్యదర్శి బాలరాజు, పోలూరు వెంకటస్వామి, చిన్నయ్య, గిద్దలూరు శ్రీనివాసులు, సుధాకర్, లక్ష్మయ్య, హరికిరణ్, మురళీ, శివ, అంజి, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో మహిళ మృతి

శ్రీశైలంప్రాజెక్ట్: విద్యుదాఘాతంతో సున్నిపెంటకు చెందిన షేక్.నూరున్నీసా(48) మంగళవారం ఉదయం మృతిచెందింది. సులేమాన్ సెంటర్‌లో పిండిమర నడుపుతున్న షేక్ ఉమర్ భార్య నూరిన్నీసా మంచినీరు వస్తుండగా మోటరు వేసి నీళ్లుపట్టుకుంది. అనంతరం మోటారు తీస్తుండగా అకస్మాత్తుగా విద్యుత్ ఘాతానికి గురై అపస్మారక స్థితిలోకి చేరుకుంది. గమనించిన కుటుంబ సభ్యులు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు డాక్టర్లు తెలిపారు.

గుడిసె దగ్ధం

పాములపాడు: మండలంలోని ఎర్రగూడూరు గ్రామంలో మంగళవారం నాగశేషులు అనే వ్యక్తికి చెందిన పూరిగుడిసె దగ్ధమైన సంఘటన జరిగింది. బాధితుడు తెలిపిన వివరాల మేరకు ఇంట్లో భార్య వంట చేస్తుండగా పొయ్యిలో మంటలు చెలరేగి గుడిసెకు నిప్పంటుకుంది. ఆమె వెంటనే ఇంట్లో నుంచి బయటకు వచ్చింది. మంటలు విపరీతంగా చెలరేగి గుడిసె పూర్తిగా కాలిపోయింది. అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించడంతో హుటా హుటిన ఘటనా స్థలానికి చేరుకొని మంటలు అదుపు చేశారు. అప్పటికే ఇంట్లో ఉన్న నిత్యావసర సరుకులు, దుస్తులు, నగదు పూర్తిగా కాలిపోయాయి. దాదాపు రూ.3లక్షల మేర ఆస్తి నష్టం సంభవించిందని బాధితుడు వాపోయాడు. ప్రభుత్వం ఆర్థిక సహాయం అందించి ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు.

చికిత్స పొందుతూ కోలుకోలేక రైతు మృతి

బేతంచెర్ల: మండల పరిధిలోని బలపాల్లె గ్రామానికి చెందిన రైతు బెల్లం నారాయణ రెడ్డి (42) సోమవారం సాయంత్రం పొలం పని చేస్తుండగా భారీ వర్షం రావడంతో చెట్టు కిందకు వెళ్లాడు. గాలికి చెట్టు కొమ్మవిరిగి పడడంతో అతడు తీవ్రంగా గాయపడ్డాడు. సమీప పొలాలలోని రైతులు గమనించి రైతు కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. ఈ మేరకు రైతు బెల్లం నారాయణ రెడ్డిని చికిత్స నిమిత్తం కర్నూలుకు తరలించగా కోలుకోలేక మృతి చెందారని కుటుంబ సభ్యులు మంగళవారం తెలిపారు.

సేద్యం పనులు షురూ

- ఖరీఫ్ సాగుకు సన్నద్ధమవుతున్న రైతన్నలు
- ఇటీవల కురిసిన వర్షాలకు వ్యవసాయ పనుల్లో నిమగ్నం
- గత పంటల వ్యర్థాలను తొలగిస్తున్న వైనం



చిలుకలూరు వద్ద పొలంలో చెత్తను కాల్చుతున్న దృశ్యం

రుద్రవరం: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో వివిధ పార్టీల నాయకుల ఇంటింటి ప్రచారాలు, రోడ్ షోలు వంటి కార్యక్రమాలతో బిజీగా గడిపిన పల్లె ప్రజలు సార్వత్రిక ఎన్నికల పోలింగ్ ప్రక్రియ పూర్తి కావడంతో ఇక వ్యవసాయ పనులకు ఉపక్రమించారు. ఇటీవల కురిసిన వర్షాలు అనుకూలంగా ఉండటంతో రైతులు సేద్యపు పనులను ప్రారంభించి ఖరీఫ్ సాగుకు సిద్ధమవుతున్నారు. మండల కేంద్రమైన రుద్రవరంతో పాటు ఎర్రగుడిదిన్నె, చిలులూరు, డీ కొట్టాల, కొండమాయపల్లె, చందలూరు, శ్రీరంగాపురం, రెడ్డిపల్లె, ఆర్.నాగలవరం, చిత్రేనిపల్లె, ఆలమూరు తదితర గ్రామాల పరిధిలోని రైతులు పొలాల్లో గత పంటకు సంబంధించిన వ్యర్థాలను కూలీలు, ట్రాక్టర్ల ద్వారా తొలగించి.. కుప్పలుగా పోసి కాల్చివేస్తున్నారు. ట్రాక్టర్లు, ఎడ్ల బండ్లపై సేంద్రియ ఎరువును పొలాలకు తరలిస్తున్నారు. ఎరువును పొలంలో చల్లించి ట్రాక్టర్లు, ఎడ్ల కాండ్లతో సేద్యం చేపట్టారు. నిన్న మొన్నటి దాక ఎన్నికల సందడిలో ఉన్న రైతులు, కూలీలు వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు. పనులు జోరందుకున్నాయి. ఖరీఫ్‌కు సమీపిస్తుండటంతో ముందస్తు పంటలు సాగు చేసుకునేందుకు సమాయత్తం అవుతున్నారు.



రుద్రవరంలో ఎరువు తరలిస్తున్న ట్రాక్టరు



గుండుపాపల పొలాల్లో నిలిచిన వర్షపునీరు



డబ్ల్యూ గోవిందిన్నెలో దుక్కిదున్నిన పొలం

అనుకూలించిన వర్షాలు

దొర్నిపాడు: ఇటీవల కురిసిన వర్షాలకు రైతులు వేసవి దుక్కులు చేసి పొలాలను ఖరీఫ్‌కు సిద్ధం చేస్తున్నారు. గత పది రోజులుగా వర్షాలు కురుస్తుండటంతో పొలాలు పదునెక్కుతున్నాయి. ఇన్నాళ్లుగా ఎడారిలో ఉన్న పొలాల్లో నీరు కనిపిస్తుండంతో రైతులు సంబరపడుతున్నారు.

ఉయ్యాలవాడలో 84.30శాతం పోలింగ్

గ్రామం	2024లో మొత్తం ఓట్లు	పోలైన ఓట్లు	2019లో మొత్తం ఓట్లు	పోలైన ఓట్లు
హరివరం	2,187	1848	2142	1826
నర్సిపల్లె	774	656	707	666
సుద్దమల్ల	535	448	502	433
పడిగెపాడు	312	268	315	263
ఉయ్యాలవాడ	3,340	2,675	3,218	2,629
రూపనగుడి	930	798	893	783
అల్లూరు	1,834	1,512	1,851	1,584
ఎస్.కొత్తపల్లె	318	282	306	269
తుడుమలదిన్నె	1,086	963	1,043	937
మాయలూరు	1,179	1,008	1,127	960
గోవిందపల్లె	322	283	310	266
పుచ్చకాయలపల్లె	432	380	408	350
కాకరవాడ	1,125	919	1,072	883
బోడెమ్మనూరు	1,135	992	1,109	974
ఇంజేడు	1,268	1,073	1,187	1,030
కొండుపల్లె	997	829	976	837
సర్వాయిపల్లె	912	788	848	763
పెద్దయమ్మనూరు	1,444	1,166	1,434	1,127
ఆర్.జంబులదిన్నె	1,483	1,218	1,409	1,145
ఆర్.పాపంపల్లె	1,155	1,088	1,160	1,028

ఉయ్యాలవాడ: సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా మండలంలో సోమవారం జరిగిన పోలింగ్‌లో 84.30 శాతం నమోదైంది. 2019లో జరిగిన ఎన్నికల్లో 85.17 శాతం నమోదైంది. గత ఎన్నికలతో పోలిస్తే ఆ సారి పోలింగ్ శాతం స్వల్పంగా తగ్గింది. పోలింగ్ సరళిని బట్టి మండలంలో వైఎస్సార్‌సీపీ ఆధిక్యంలో నిలుస్తుందని ప్రజలు చర్చించుకుంటున్నారు. గ్రామాల వారీగా పోలింగ్ వివరాలు

పేదలకు న్యాయమే లోక్ అదాలత్ లక్ష్యం



మాట్లాడుతున్న జడ్జి రాధారాణి

నంద్యాల(వ్యవసాయం): పేదలకు న్యాయం అందించాలన్నదే లక్ష్యంగా జాతీయ మెగా లోక్ అదాలత్ ఏర్పాటు చేస్తున్నట్లు ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి రాధారాణి తెలిపారు. మంగళవారం మండల లీగల్‌సెల్ ఆధ్వర్యంలో న్యాయవాదులకు మధ్యవర్తిత్వంపైన అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. జడ్జి మాట్లాడుతూ మండల లీగల్‌సెల్‌లో ప్యానల్ న్యాయవాదుల ద్వారా కోర్టులో అప్పీల్ లేకుండానే నేరుగా లోక్‌అదాలత్‌ను సంప్రదిస్తే న్యాయవాదుల మధ్యవర్తిత్వం ద్వారా కేసులను త్వరితగతిన పరిష్కరించుకోవచ్చని చెప్పారు. ఎటువంటి రుసుము లేకుండా కేసులు పరిష్కారమవుతాయన్నారు. జూన్ 29న కోర్టు ఆవరణలో జాతీయ మెగా లోక్ అదాలత్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని న్యాయవాదులకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు దుర్గాప్రసాద్, వెంకటేశ్వర్లు, తిరుపతి, శేషసాయి, ఓబులరెడ్డి, జీవీఎస్ ప్రసాద్, రఘుప్రకాష్, కృష్ణ లింగయ్య, తదితరులు పాల్గొన్నారు.

వడదెబ్బపై అప్రమత్తంగా ఉండాలి



ఉయ్యాలవాడలో ఉదయం 11 గంటలకు నిర్మానుష్యంగా మారిన ప్రధాన రహదారి



అపర్ణ, వైద్యాధికారిణి, ఉయ్యాలవాడ

ఉయ్యాలవాడ: వేసవి ఉష్ణోగ్రతలు జనాన్ని బెంబేలెత్తిస్తున్నాయి. గత రెండురోజులుగా కురుస్తున్న వర్షాలతో వాతావరణం కాస్త చల్లబడినప్పటికీ అంతకుముందు రికార్డు సాయిలో ఎండలు నమోదయ్యాయి. జిల్లాలో 46 డిగ్రీల వరకు సూర్యప్రతాపం చేరింది. మంగళవారం కాస్త చల్లబడినా ఉయ్యాలవాడలో 39 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. ఈ స్థితిలో ప్రజలు వడదెబ్బ బారిన పడకుండా అప్రమత్తంగా ఉండాలని స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణి అపర్ణ సూచించారు. చిన్నపిల్లలు, వృద్ధులు ఎక్కువ శాతం వడదెబ్బ బారిన పడే అవకాశం ఉందన్నారు. వడదెబ్బ బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఆమె వివరించారు.

వడదెబ్బ లక్షణాలు

- 102 డిగ్రీల జ్వరం, తీవ్ర తలనొప్పి, దప్పిక ఉండి నాలుక పిడచగట్టుకుపోతుంది.
- జ్వరం తగ్గినా నీరసంగా ఉంటుంది. నిర్లక్ష్యం చేస్తే ప్రాణాపాయ స్థితికి చేరుకోవాల్సి వస్తుంది.

నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు

- సాధ్యమైనంత వరకు మధ్యాహ్నం వేళ బయటకు వెళ్లరాదు. ఉదయం 11 గంటల్లోపు, సాయంత్రం 4 గంటల తరువాత బయటి పనులు చేసుకోవాలి.
- మంచినీరు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంచుకోవాలి. ఎక్కువగా నీరు తాగుతూ ఉండాలి.
- ఆహారంలో నూనె, కొవ్వు పదార్థాలను వీలైనంతవరకు తగ్గించాలి.
- పండ్లు, పండ్ల రసాలు, కొబ్బరి బోండాం, మజ్జిగ ఎక్కువగా తీసుకోవాలి.
- వడదెబ్బ తగిలిన వ్యక్తులకు చల్లని నీరు తాగించరాదు.
- నీడ ఉన్న ప్రదేశంలో పడుకోబెట్టి కుండలోని నీరు అందించాలి. తడి గుడ్డతో శరీరం బాగా తుడవాలి.
- వేడి తీవ్రంగా ఉన్నట్లయితే ఓఆర్ఎస్ లేదా ఐవీ ఫ్లూయిడ్స్ ఇవ్వాలి.
- ఉప్పు కలిపిన మజ్జిగ, లేదా చిటికెడు ఉప్పు కలిపిన గ్లూకోజ్ తాపాలి.
- బాగా గాలి తగిలేటట్టుగా నీడ ప్రదేశాల్లో విశ్రాంతి తీసుకునేలా అవకాశం కల్పించాలి.
- ప్రథమ చికిత్స అనంతరం దగ్గరలో ఉన్న ఆసుపత్రికి వెళ్లి వైద్య సేవలు చేయించాలి.
- వేసవికాలం ఇంట్లో కిటికీలు తెరచిఉంచాలి. ఫ్యాన్ గాలి బయటకు వెళ్లేందుకు గృహంలో వసతి ఉండాలి.
- అత్యవసర పరిస్థితుల్లో మధ్యాహ్నం బయటకు వెళ్లాల్సినప్పుడు గొడుగు లేదా టోపీ తలకు ధరించాలి.

ఎవరి అంచనాలు వారివే..


శిరివెళ్ల: సార్వత్రిక ఎన్నికల పోలింగ్ ముగిసింది. పోలింగ్ సరళిని బట్టి గ్రామస్థాయి నుంచి మండల స్థాయి వరకు ఆయా పార్టీల నాయకులు అంచనాల సేకరణలో బిజీగా ఉన్నారు. ఓటింగ్ నమోదు ఆధారంగా బూత్ వారీగా పోలింగ్ వివరాలను సేకరిస్తున్నారు. వైఎస్సార్‌సీపీ, టీడీపీ నాయకులు తమకే మెజార్టీ వస్తుందని ధీమా వ్యక్తం చేస్తున్నారు. మండల కేంద్రం శిరివెళ్లలో మొత్తం 14,505 ఓట్లున్నాయి. అందులో 10వేల దాకా ముస్లిం ఓటర్లే. అందులో 80 శాతం ఓట్లు గంప గుత్తగా తనకే పడ్డాయని వైఎస్సార్‌సీపీ నాయకులుయ ధీమా వ్యక్తం చేస్తున్నారు. మండలంలో మిగిలిన గోవింద పల్లె, యర్రగుంట్ల, జీనేపల్లె, కామినేనిపల్లె, కోటపాడు, వీరారెడ్డిపల్లె, వెంకటాపురం, బోయలకుంట్ల, మహదేవపురం, గుంప్రమాన్‌దిన్నె, చెన్నూరులలో తమకే మెజార్టీ వస్తుందని ఆ పార్టీ నాయకులు అంచనా వేస్తున్నారు. మిగిలిన గ్రామాలు గంగవరం, మోత్కలపల్లె, కాదరబాదర, ఇసుకపల్లెలలో స్వల్ప మెజార్టీ వస్తుందని భావిస్తున్నారు. మండలం మొత్తం మీద 5 వేల నుంచి 6 వేలు దాకా మెజార్టీ రావచ్చని నాయకులు ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉండగా తమ మేనిఫెస్టోలో మహిళలకు వరాలు ఇచ్చామని వారి ఓట్లు తమ పార్టీకే పడ్డాయని టీడీపీ నాయకులు పేర్కొంటున్నారు. ఏదీ ఏమైనా ఫలితం తేలాలంటే జూన్ 4న జరగనున్న లెక్కింపు వరకు ఆగాల్సిందే. ఇదిలా ఉండంగా పోలింగ్ తర్వాత జోరుగా బెట్టింగ్‌లు మొదలయ్యాయి.

ఈత సరదా



కుందూ నదిలో ఈత కొడుతున్న చిన్నారులు

దొర్నిపాడు: మండు వేసవిలో చిన్నారులు సరదగా కాసేపు కుందూ నదిలో ఈత కొడుతూ సంబరపడుతున్నారు. మండలంలోని క్రిష్టిపాడులో కుందూలో నీరు ప్రవహిస్తుండడంతో చిన్నారులు నీటిలో జలకాలాటలు ఆడుతూ ఉపశమనం పొందుతున్నారు. వేసవి సెలవులు కావడంతో చిన్నారులు ప్రతి రోజూ ఇలా ఈత సరదా తీర్చుకుంటున్నారు.



వంతెనపై నుంచి దూకుతూ కేరింతలు



టీ స్టాల్‌లో మిత్రులతో చిట్‌చాట్ చేస్తున్న ఎమ్మెల్యే శిల్పా రవి

రిలాక్స్.. రిలాక్స్ !

నంద్యాల వ్యవసాయం: సార్వత్రిక సమరంలో రాజకీయ నేతలు, ప్రజాప్రతినిధులు దాదాపు రెండు నెలలు విరామం లేకుండా బిజీబిజీగా గడిపారు. సభలు, సమావేశాలు, ఇంటింటి ప్రచారం, కార్యకర్తలు, నాయకులతో సమీక్షలు.. ఇలా రోజూ ఉదయం లేచింది మొదలు అర్ధరాత్రి వరకు ఎన్నికల పైనే దృష్టి సారించారు. ప్రత్యర్థుల ఎత్తులకు పైఎత్తులు వేస్తూ.. విమర్శలను ప్రతి విమర్శలతో తిప్పికొడుతూ.. జనంతో మమేకమవుతూ .. హోరాహోరీగా ముందుకు సాగారు. సోమవారం పోలింగ్ కూడా ముగిసింది. ఇక ఫలితాలు వెలువడేందుకు ఇంకా 20 రోజుల సమయం ఉంది. ఎన్నికల బిజీ నుంచి బయటపడిన నాయకులు మంగళవారం కుటుంబీకులు, స్నేహితులు, పార్టీ కార్యకర్తలతో కాసేపు సరదాగా గడిపారు. ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి మంగళవారం ఉదయాన్నే వాకింగ్ అనంతరం పట్టణంలోని పద్మావతి నగర్‌లోని ఓ టీ స్టాల్‌లో తన మిత్రులు, సన్నిహితులతో కలిసి టీ తాగుతూ చిట్ చాట్ చేశారు. మిత్రులు ఆయనతో సెల్ఫీలు తీసుకుని ఆనందోత్సాహాలతో గడిపారు.

నంద్యాలలో పోటెత్తిన ఓటరు

- 75 శాతం పోలింగ్ నమోదు
- రికార్డు స్థాయిలో ఓటు హక్కు వినియోగం



ప్రభుత్వ బాలికోన్నత పాఠశాల వద్ద ఓటు వేసేందుకు క్యూలో ఉన్న ఓటర్లు

నంద్యాల(అర్బన్): నంద్యాల అసెంబ్లీ నియోజకవర్గంలో సోమవారం జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో ఓటర్లు పోటెత్తారు. మొత్తం 2,73,938 మందికిగాను 2,05,190 మంది (74.90 శాతం) ఓటు హక్కును వినియోగించుకున్నారు. నంద్యాల పట్టణంతో పాటు గోస్పాడు మండలం నియోజకవర్గ పరిధిలోకి వస్తాయి. నంద్యాల మండలం పోలూరు గ్రామంలోని ఐదు పోలింగ్ బూత్‌ల్లో 3925 మందికిగాను 3526 మంది 89.81 శాతం మంది ఓటు హక్కును వినియోగించుకోగా, అయ్యలూరు గ్రామ పరిధిలోని ఆరు పోలింగ్ బూత్‌ల పరిధిలో 5576 మందికిగాను 4638 (83.17 శాతం) ఓట్లు పోలయ్యాయి. అదే విధంగా చాబోలు గ్రామ పరిధిలోని ఆరు పోలింగ్ బూత్‌ల్లో 4395 మంది ఓటర్లు ఉండగా 3762 మంది (85.59 శాతం) ఓట్లు వేశారు. రాయమాల్పురం గ్రామంలోని ఒకే పోలింగ్ బూత్‌లో 1202 మంది ఓటర్లలో 1118 మంది ఓటర్లు (93.01 శాతం), మునగాల గ్రామ పంచాయతీలోని పోలింగ్ బూత్‌లో 774 మందికి గాను 706 మంది (91.21 శాతం) ఓటు హక్కును వినియోగించుకున్నారు. బ్రాహ్మణపల్లె గ్రామ పంచాయతీలోని పోలింగ్ బూత్‌లో 3364 మంది 88.99 శాతంతో ఓటు హక్కును వినియోగించుకోగా గుంతలనా గ్రామ పంచాయతీ పోలింగ్ బూత్‌లో 842 మంది ఓటర్లకుగాను 692 మంది (82.18 శాతం) ఓట్లు వేశారు. మొత్తం మీద నియోజకవర్గంలో ఓటర్లు ఉత్సాహంగా ఓటింగ్‌లో పాల్గొనడంతో 75 శాతం పైగా పోలింగ్ జరిగినట్లు అధికారులు తెలిపారు. అనూహ్య స్థాయిలో పోలింగ్ శాతం పెరగడం శుభపరిణామమని అధికారులు పేర్కొన్నారు.

వైభవంగా అష్టాదళ పాదపద్మారాధన సేవ



శ్రీకాళికాంబ అమ్మవారికి అష్టాదళ పాదపద్మారాధన సేవ నిర్వహించిన దృశ్యం

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని గాంధీచౌక్‌లో వెలసిన శ్రీ కాళికాంబ చంద్రశేఖర దేవస్థానంలో అమ్మవారికి మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీకాళికాంబ మూలవిరాట్‌కు ఉదయాన్నే సుప్రభాత సేవ, పంచామృత అభిషేకాలు, నిమ్మ, వేప రసాలచే ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. అనంతరం అమ్మవారిని పట్టువస్త్రాలతో అలంకరించి వివిధ రకాల పూలచే పూలంగి సేవా కార్యక్రమం నిర్వహించారు. అమ్మవారికి ఒడిబియ్యం కార్యక్రమం నిర్వహించి, 108 వెండి పుష్పాలచే అష్టాదళ పాదపద్మారాధన సేవ నిర్వహించి మహామంగళ హారతులు ఇచ్చారు. అనంతరం అమ్మవారికి నవవిధ హారతులు ఇచ్చి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆలయ ఈఓ లక్ష్మీనారాయణ, ఆరవేటి వాసు, విజయ్‌కుమార్ తిమ్మయ్య, నరసింహ, భక్తులు పాల్గొన్నారు.

సెలవులను సద్వినియోగం చేసుకుందాం

- వేసవి సెలవుల్లో చిన్నారుల్లో పెరిగిన మొబైల్ వీక్షణం
- రోజుకు నగటున 3 గంటలకు పైనే
- క్రీడా శిక్షణపై దృష్టి మరల్చితే మేలు



విద్యార్థులకు మానసిక ఆరోగ్యంపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం (ఫైల్)

నంద్యాల(న్యూటౌన్): వేసవి సెలవులు వచ్చాయంటే చాలు. పిల్లలకు ఎక్కడ లేని ఆనందం.. ఏడాది పాటు తీరిక లేకుండా చదివిన తమ పిల్లలకు కాస్త తీరిక దొరికిందని తల్లిదండ్రులకు సంతోషం. ఒకవైపు సెలవుల్లో మొబైల్ ఫోన్ అతిగా వాడడం, అల్లరి చేష్టలతో ఎక్కడ ఆరోగ్యం మీదకు తెచ్చుకుంటారోనని ఆందోళన మరోవైపు ఉంటోంది. ఈ మధ్యకాలంలో 69 శాతం మంది పిల్లలు రోజుకు సగటున మూడు గంటల కంటే ఎక్కువ సమయాన్ని మొబైల్ వీక్షించడానికి కేటాయిస్తున్నారని ఓ సర్వేలో వెల్లడైంది. 96 శాతం మంది తల్లిదండ్రులు తమ పిల్లలు ఫోన్ వైపు ఆకర్షితులు కాకుండా ఉండడానికి ఏం చేయాలో తెలుసుకోవడానికి ఆన్‌లైన్‌లో వెతుకుతున్నారని మరో సర్వే ద్వారా తెలుస్తోంది. గతంలో విహార యాత్రలకు, అమ్మమ్మ, నానమ్మ స్వగ్రామాలకు వెళ్లడం చేసేవారు. ప్రస్తుతం అది చాలా వరకూ తగ్గింది. సెలవుల్లో పిల్లలు ఆసక్తి కనబరిచే క్రీడల్లో శిక్షణ అందిస్తే మేలని నిపుణులు సూచిస్తున్నారు.

పెరిగిన సెల్‌ఫోన్ వినియోగం

కరోనా సమయంలో ఆన్‌లైన్ క్లాసులు నిర్వహించడంతో చాలామంది పిల్లలకు మొబైల్ ఫోన్ అందుబాటులోకి వచ్చింది. తల్లిదండ్రులు ఇద్దరూ ఉద్యోగస్తులు కావడం, మరికొందరు జీవనోపాధి నిమిత్తం పనులకు వెళ్లిన సందర్భాల్లో పిల్లల క్షేమ సమాచారం కోసం సెల్‌ఫోన్లను తమ చిన్నారులకు అందుబాటులో ఉంచుతున్నారు. ఇలా పదేళ్లలోపు పిల్లలు 42 శాతం, 10–12 ఏళ్ల పిల్లలు 71 శాతం, 12–14 ఏళ్లలోపు వారు 91 శాతం వ్యక్తిగత మొబైల్ ఫోన్లను కలిగి ఉంటున్నారని సమాచారం. దీంతో సెల్‌ఫోన్‌లో గేమ్స్ ఆడుతూ, సామాజిక మాధ్యమాల్లో రీల్స్ చూస్తూ కాలం గడిపేస్తున్నారు. ఇటీవల కాలంలో చిన్నారులు ఎక్కువగా ఆటిజం సమస్యకు గురవుతున్నారు. మొబైల్ గేమ్ ఎడిక్షన్‌కు లోనవుతున్నారు. ఇలాంటి సమస్యలు రాకుండా ముందుగానే పిల్లలను తల్లిదండ్రులు ఓ కంట కనిపెట్టాలి.

క్రీడా శిక్షణ శిబిరాలు...

విద్యార్థులకు వివిధ క్రీడాంశాలపై ఉచితంగా శిక్షణ అందించేందుకు జిల్లా యువజన క్రీడల అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. ఇప్పటికే జిల్లాల వారీగా క్రీడా శిక్షణ శిబిరాల నిర్వహణకు వ్యాయామ ఉపాధ్యాయులు, సీనియర్ క్రీడాకారుల నుంచి దరఖాస్తుల ఆహ్వానించే పనిలో ఉన్నారు. మే 1 నుంచి 31 వరకు ఆయా ప్రాంతాల్లో ఉదయం, సాయంత్రం వేళల్లో ఫుట్‌బాల్, అథ్లెటిక్స్, బాక్సింగ్, వాలీబాల్, ఖోఖో, చెస్, బ్యాడ్మింటన్ తదితర క్రీడలపై శిక్షణ ఇచ్చేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నారు. శిక్షణ పూర్తయ్యాక ధ్రువీకరణ పత్రాలను అందజేస్తారు.

ఇలా చేయాలి..

చిన్నారులకు ఫోన్ ఇచ్చే సందర్భంలో యూట్యూబ్ కిడ్స్ మాత్రమే ఓపెన్ చేయాలి. ఇన్‌స్టాగామ్, అడల్ట్ యాప్స్, సోషల్ మీడియా యాప్స్ ఓపెన్ కాకుండా యాప్ లాక్స్ వేసుకోవాలి. పజిల్ గేమ్స్, వర్డ్ బిల్డింగ్, గణితం పజిల్స్ తదితర యాప్స్ మాత్రమే చిన్నారులు వినియోగించేలా చూడాలి. పెద్ద పిల్లల విషయంలో కచ్చితంగా తల్లిదండ్రుల పర్యవేక్షణ అవసరం. స్మార్ట్ ఫోన్ కంపెనీలు ఫోన్లలో పేరెంటల్ కంట్రోల్ అనే ఆప్షన్ అందుబాటులోకి తెచ్చాయి. సెట్టింగ్స్‌లోకి వెళ్లి ఫోన్ వినియోగ సమయాన్ని నిర్ధారించుకోవాలి.

అతిగా వినియోగిస్తే అనర్థం



అతిగా సెల్‌ఫోన్ వినియోగంతో అనర్థాలే. ఇది జ్ఞాపకశక్తిపై కూడా ప్రభావితం చూపుతుంది. తలనొప్పి, బ్యాక్ పెయిన్ సమస్యలు వస్తాయి. చికాకు, అసహనం, కోపం, తిరుగుబాటు ధోరణి పెరుగుతుంది. 5–6 ఏళ్ల వయసులో సహజంగా మెదడు ఎదుగుదల ఉంటుంది. ఆ సమయంలో చిన్నారులకు స్క్రీన్ టైమ్ ఎక్కువగా ఉంటే మెదడు ఎదుగుదలపై ప్రభావం పడుతుంది. ఇప్పుడు ప్రతి 10 మంది చిన్నారుల్లో ముగ్గురికి ఆటిజం లక్షణాలు కనిపిస్తున్నాయి.

– ఆరిఫాబాను, సైకాలజిస్ట్, నంద్యాల

ఏటా వేసవి క్రీడా శిక్షణ శిబిరాలు



పిల్లల కోసం ఏటా వేసవి క్రీడా శిక్షణ శిబిరాలు ఏర్పాటు చేస్తున్నాం. ఈ ఏడాది 50 శిబిరాల ఏర్పాటుకు అంచనాలు రూపొందించాం. దీని కోసం అందుబాటులో ఉన్న కోచ్‌లు, మౌలిక వసతులు, ఆసక్తి ఉన్న పీడీల వివరాలు సేకరిస్తున్నాం. జిల్లాలో వివిధ ప్రాంతాల్లో ఆసక్తి ఉన్న గేమ్స్, అథ్లెటిక్స్ ఆధారంగా శిబిరాలు ఏర్పాటు చేస్తాం. రాష్ట్ర యువజన క్రీడల ఉన్నతాధికారుల ఆమోదం పొంది శిబిరాలను ప్రారంభించాం.

– రాజు, జిల్లా యువజన క్రీడల అభివృద్ధి అధికారి, నంద్యాల

రేడియేషన్ బారిన పడొద్దు



సెల్‌ఫోన్ ఎక్కువగా ఉపయోగిస్తే పెద్దవాళ్లపైనా ప్రభావం పడుతుంది. చిన్నపిల్లల్లో కంటి చూపుపై ప్రభావం ఉంటుంది. నిద్రలేమి సమస్య రావచ్చు. చాలామంది తల్లిదండ్రులు పిల్లల చేతుల్లో గంటల పాటు ఫోన్ ఉంచుతున్నారు. అలా చూడడం వల్ల పిల్లల మెదడుపై రేడియేషన్ ప్రభావం పడుతుంది. కంటితో పాటు వెన్ను సమస్యలు వస్తాయి. సెల్‌ఫోన్లు ఎక్కువగా చూడటం వల్ల మానసిక ఎదుగుదల లోపిస్తుంది. చలాకీ తనం తగ్గుతుంది. కంటి సమస్యలు, మెడలో కండరాల బలహీనత ఏర్పడుతుంది. పిల్లలు ఇండోర్, అవుట్‌డోర్ గేమ్‌లు ఆడే విధంగా తల్లిదండ్రులు చూడాలి. సెలవుల్లో పిల్లలను పిక్నిక్‌లకు, వినోదాలకు తీసుకువెళ్లడం మంచిది.

–డాక్టర్ వెంకటరమణ, డీఎంఅండ్‌హెచ్‌ఓ